## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

● 'డబుల్' ఇళ్ల కోసం..

**కూసుమంచి:** మండలంలోని మల్లేపల్లి గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 5, 6, 7 తేదీల్లో దరఖాస్తుతో పాటు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

● సీఎం కప్ క్రీడా పోటీల కోసం..

**రఘునాథపాలెం:** సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా మండలంలో నిర్వహించే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగ పోటీలకు క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీలోగా https//:cmcup2024.gov.in అనే వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10 నుంచి మూడు రోజులు పాటు మండలస్థాయిలో, 16 నుంచి 21వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయన్నారు.

● 18 'డబుల్' ఇళ్లు.. 114 దరఖాస్తులు..

**నేలకొండపల్లి:** మండలంలోని ఆచార్లగూడెంలో నిర్మించిన డబుల్ ఇళ్ల ఎంపిక కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు గత వారం రోజులుగా గ్రామంలో అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో ఆఖరిరోజు బుధవారం నాటికి మొత్తం 18 ఇళ్లకు 114 దరఖాస్తులు రాగా వాటిని కలెక్టర్‌కు పంపించారు. అయితే పెద్దమొత్తంలో దరఖాస్తులు రావడంతో లాటరీ పద్ధతిలో ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి, సిబ్బంది బోయిన ఆది, కె.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం

**ఖమ్మంఅర్బన్:** నగరంలోని బాలాజీనగర్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ బాధ్యులు పాఠశాల ఉపాధ్యాయుడు నాగిరెడ్డి ప్రోత్సాహంతో సాయంత్రం అల్పాహారాన్ని(స్నాక్స్) బుధవారం పంపిణీ చేశారు. వార్షిక పరీక్షలు అయ్యే వరకూ స్నాక్స్ పంపిణీ ఉంటుందని క్లబ్ ప్రెసిడెంట్ పెసర ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే పాఠశాల నుంచి కరాటేలో నేషనల్‌కు ఎంపికై న హర్షతేజకు ఆర్థిక సాయం అందించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బాలికలకు శానిటరీ కిట్లను అందజేశారు.

### అరుదైన వైద్య చికిత్స

**ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం):** ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఖమ్మంకు చెందిన శ్రీనివాస్‌కు అరుదైన చికిత్స అందించి ప్రాణం కాపాడినట్లు సోమాజిగూడలోని యశోద ఆస్పత్రి క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణ్యం తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి గతంలో నియంత్రించలేనిదిగా భావించే వారని, కానీ సమయానికి గుర్తించి మెరుగైన వైద్యంతో నివారించవచ్చన్నారు. ఈమేరకు వెంటిలేటర్ సాయంతో శ్రీనివాస్‌కు చికిత్స చేయడంతో కోలుకున్నాడని తెలిపారు.

### పశు వైద్య శిబిరం

**కామేపల్లి :** పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గోపాలమిత్ర పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముచ్చర్ల పశు వైద్యాధికారి డాక్టర్ గోపీక్రిష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మద్దులపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ నరసింహారావు, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

### పరీక్షా కేంద్రం మార్పు సరికాదు

**ఖమ్మం సహకారనగర్:** గతంలో ఖమ్మంలో నిర్వహించే టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్ పరీక్షా కేంద్రాన్ని మధిరలోని పాలిటెక్నిక్ కళాశాలకు మార్పు చేయడం సరికాదని ఖమ్మం జిల్లా టైపు రైటింగ్ షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ శిక్షణ కేంద్రాల అధ్యక్షుడు వీరభద్రరావు, బాధ్యులు తిలక్, నరేష్, షేక్ బాజీబాబాలు ఒక ప్రకటనలో కోరారు. గతంలో మాదిరిగానే ఖమ్మంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొంటూ మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు.

### డిపోలో వనభోజనాలు

**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం డిపోలో టీజీఎస్ ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వనభోజనాల కార్యక్రమాన్ని బుధవారం రెండో రోజు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది వారి కుటుంబసభ్యులతో కలిసి పాల్గొనగా.. ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు డీఎం దినేష్‌కుమార్ బహుమతులు అందజేశారు.

### సంతాపం

**ఖమ్మంమయూరిసెంటర్:** మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, కొత్తగూడెం పట్టణ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మోరె భాస్కర్ ఆకస్మిక మరణం పట్ల రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# అభ్యసన.. అవస్థలు




ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వేధిస్తున్న గదుల కొరత**

- సౌకర్యాల కల్పనకు కలెక్టర్ హామీ
- మరో రెండు గదుల నిర్మాణం
- ఇంకా 10 గదుల వరకు అవసరం

**ఖమ్మంసహకారనగర్:** నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అభ్యసిస్తున్న విద్యార్థినులను గదుల కొరత వేధిస్తోంది. ఈనేపథ్యాన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో కళాశాలకు మరో రెండు గదులు మంజూరు కానున్నాయి. విద్యార్థినుల సంఖ్య ఎక్కువ కావడంతో కళాశాలలో తరగతుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ తరుణంలో ఇటీవల కలెక్టర్ కళాశాలను సందర్శించగా.. కళాశాల ప్రిన్సిపాల్ సమస్యను ఆయన దృష్టికి తీసుకురావడంతో రెండు గదుల నిర్మాణానికి హామీ ఇచ్చారు.

**సరిపోని తరగతి గదులు..**

కళాశాలలో 899 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తుండగా.. ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో పాటు ఒకేషనల్ విద్యార్థులున్నారు. ఇంటర్మీడియట్‌లో నాలుగు కోర్సులు ఉండగా.. ఒకేషనల్‌లో సుమారు 6 కోర్సులు ఉన్నాయి. ఇందులో తెలుగు, ఇంగ్లిష్ మీడియం బోధన వేర్వేరుగా సాగాల్సి ఉన్నా.. తరగతి గదుల కొరతతో కొన్ని సందర్భాల్లో అందరినీ ఒకేచోట కూర్చోబెట్టి బోధన సాగిస్తున్నారు. గతంలో సైతం తరగతి గదుల కొరత ఉన్న క్రమంలో గత కలెక్టర్ వీపీ గౌతమ్ రెండు తరగతి గదులను మంజూరు చేసి నిర్మాణం చేయించగా.. కొంత సమస్య తీరింది కానీ పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కళాశాలలో ఓ కార్యక్రమానికి హాజరు కాగా.. అక్కడి సమస్యను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి మరో రెండు గదులు మంజూరుకు హామీ ఇచ్చారు.

**ఇంకా 'పది' అవసరం..**

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తరగతి గదులు, ల్యాబ్‌లు కలిపి ఇంకా 10 వరకు గదులు అవసరం ఉన్నాయి. అయితే ప్రస్తుతం తరగతి గదులు 20, ల్యాబ్‌లు 4 ఉండగా.. మరో 4 తరగతి గదులు, 6 ల్యాబ్‌లు అవసరం ఉన్నాయి. వీటిలో రెండు గదులను మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**రెండు గదుల మంజూరుకు హామీ..**



విద్యార్థులకు తరగతి గదుల కొరత ఉన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై స్పందించిన కలెక్టర్ రెండు గదులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ గదులు త్వరితగతిన మంజూరైతే కొంతమేర సమస్య తీరినట్లవుతుంది.

– అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

## డేటా ఎంట్రీని పరిశీలించిన మేయర్

**ఖమ్మంమయూరిసెంటర్:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు సేకరించిన సమాచార డేటా ఎంట్రీని బుధవారం కేఎంసీ కార్యాలయంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం ఎన్ని ఫారాలు ఉన్నాయి.. వాటిలో ఎన్ని ఆన్‌లైన్ చేశారనే వివరాలను సిబ్బందిని అడగగా.. 97 వేల ఫారాలకు 55 వేల ఫారాలను ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలని, త్వరితగతిన పూర్తి చేయడానికి ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం 26వ డివిజన్ రిక్కాబజార్, బ్రాహ్మణబజార్ ప్రాంతాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న మేయర్ నీరజ

### హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న సమితి ప్రతినిధులు

**ఖమ్మంగాంధీచౌక్:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను నిరసిస్తూ బుధవారం నగరంలో హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. పెవిలియన్ గ్రౌండ్ నుంచి సర్దార్ పటేల్ స్టేడియం వరకు ప్లకార్డులు, ఫ్లెక్సీలతో ప్రదర్శన నిర్వహించి ఇస్కాన్ దేవాలయాలపై దాడులు చేస్తూ స్వామీజీలను అరెస్టు చేయడం సరైంది కాదని నినదించారు. ఈ కార్యక్రమంలో హిందే ధర్మ రక్షణ సమితి ప్రతినిధులు కాటేపల్లి లక్ష్మయ్య, అల్లిక అంజయ్య, బోనాల రామకృష్ణ, కీసర జయపాల్‌రెడ్డి, తాండ్ర వినోదరావు, శీలం పాపారావు, నేరెళ్ల శ్రీనివాస్, సురేఖ, రాజ్యలక్ష్మి, చంద్రశేఖర్ సందీప్, ఇస్కాన్ ప్రతినిధులు జీవదాసజీ, వికాస తరంగిణి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఎఫ్‌సీఐ కార్మికులను వేధిస్తే సహించం

**ఖమ్మంమయూరిసెంటర్:** గత రెండు నెలల నుంచి ఎఫ్‌సీఐ హమాలీలు, స్వీపర్లను వేదనకు గురి చేస్తున్నారని, కాంట్రాక్టర్ సక్రమంగా వ్యవహరించడంలేదని, ఎఫ్‌సీఐ కార్మికులను వేధిస్తే సహించమని సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి కల్యాణ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సీఐటీయూ రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హమాలీలకు రేట్లు తగ్గించడం కోసం పోటీగా కార్మికులను తీసుకొచ్చారని, కాంట్రాక్టర్ సక్రమంగా వ్యవహరించకపోతే ఎఫ్‌సీఐ అధికారులు కాంట్రాక్టు రద్దు చేయాలన్నారు. అనంతరం టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యంగా ఉన్నంతకాలం విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వై.విక్రమ్, హమాలీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా శ్రీనివాసరావు, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్, నాయకులు శ్రీనివాస్, రమేష్, వెంకటేశ్వర్లు, బి.శ్రీశైలం, సాయిలుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సులు పెంచాలని వినతి

**ఖమ్మంమయూరిసెంటర్:** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు పెంచాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం డిపో ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డీఎం దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రయాణికుల సంఖ్యకు తగినన్ని బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలకు రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. ఈనేపథ్యాన ఈ నెల 9న తలపెట్టిన బస్సు భవన్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, సీహెచ్.శిరోమణి, మంగతాయి, ఝాన్సీ, శోభ, కె.శ్రీను, హనుమంతరావు, కె.లక్ష్మణ్, పీడీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుమలాయపాలెం తొలి ఎంపీపీ రామయ్య మృతి



ఊడుగు రామయ్య (ఫైల్)

**తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం మండల పరిషత్ తొలి అధ్యక్షుడు, కొక్కిరేణికి చెందిన ఊడుగు రామయ్య (90) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్వగ్రామంలో కన్నుమూశారు. కాంగ్రెస్ నాయకుడిగా స్వర్గీయ వైఎస్సార్‌ను అభిమానించే రామయ్య తొలినాళ్లో జలగం వెంగళరావుతో కలిసి పనిచేశారు. 1987 నుండి 92 వరకు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన మండల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవారు. రామయ్యకు భార్య రాంబాయమ్మ, కుమారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కొండల్‌రావు, రాధాకృష్ణతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, గురువారం కొక్కిరేణిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు రామయ్య మృతదేహం వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. వివిధ పార్టీల నాయకులు పుసులూరి నరేందర్, కమ్మకోమటి నాగేశ్వరరావు, బండి జగదీష్, అమరగాని వెంకన్న, శ్రీనివాసరావు తదితరులు కూడా నివాళులర్పించారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ఖమ్మం సహకారనగర్:** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఖమ్మం ట్రాఫిక్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సాంబ పేర్కొన్నారు. బుధవారం మమత రోడ్‌లోని శ్రీచైతన్య ఒలంపియాడ్ పాఠశాల ఆధ్వర్యాన నగరంలో ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించి హెల్మెట్ లేని వాహనదారులకు గులాబీ పూలు అందించి ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకన్న, డీజీఎం చేతన్ మాదూర్, ప్రిన్సిపాళ్లు శర్మ, ఏడుకొండలు, వైస్ ప్రిన్సిపాళ్లు రామకృష్ణారెడ్డి, డీన్స్ రాజశేఖర్‌రెడ్డి, కేవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రాన్ నంబర్లు కేటాయించాలి

**ఖమ్మం సహకారనగర్:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు ప్రాన్ నంబర్లు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ట్రెజరీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగంలో చేరి మూడు నెలలు గడుస్తున్నా.. నేటికి ప్రాన్ నంబర్లు కేటాయించలేదని, వెంటనే నంబర్లు కేటాయించాలన్నారు. ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షుడు గుడుపుడి శ్రీనివాసరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## నియామకాలు

● **యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అంజిని**

**నేలకొండపల్లి:** ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను బుధవారం విడుదల చేయగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఎన్నికయ్యారు. అదే విధంగా నేలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పైనంపల్లి గ్రామానికి చెందిన యడవల్లి నాగరాజు ఎన్నికయ్యారు.

● **మండల అధ్యక్షుడిగా వేణు**

**కామేపల్లి:** ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యాన ఆన్‌లైన్‌లో జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పండితాపురం గ్రామానికి చెందిన దొడ్ల వేణు, ఇల్లెందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా బర్లగూడెం గ్రామానికి చెందిన మాలోత్ ప్రేమ్‌కుమార్ విజయం సాధించారు. యూత్ ఎన్నికల్లో గెలుపొందిన వారిని తెలంగాణ వ్యవసాయ,రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి అభినందించారు. నాయకులు నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, మాలోత్ బావ్‌సింగ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **కామేపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా భూక్యా సీతారాములు..**

కామేపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా భూక్యా సీతారాములు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికకాగా పాతలింగాల గ్రామంలో తెలంగాణ వ్యవసాయ రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి ఆయనను అభినందించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు దమ్మాలపాటి సత్యనారాయణ, గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, దొడ్ల వేణు, ముక్తి సాంబశివరావు, అజ్మీరా అర్జున్, రాందాస్‌నాయక్, దొడ్డిగర్ల సుందరం, బండి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● **టీపీసీసీ మీడియా–కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్‌గా షేక్ యాసిన్**

**ఖమ్మంవన్‌టౌన్:** టీపీసీసీ మీడియా–కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్‌గా షేక్ యాసిన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన ప్రభుత్వ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

● **జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా క్రాంతికుమార్**

**ఖమ్మంవన్‌టౌన్:** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా 5,879 ఓట్లతో కస్యాల క్రాంతికుమార్ విజయం సాధించారు. ఆయన ఎన్నిక పట్ల టీపీసీసీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. క్రాంతి ఎన్నికతో యువజన కాంగ్రెస్ జిల్లాలో మరింత బలోపేతం అవుతుందన్నారు.

### మహిళా రైతుకు తీవ్ర గాయాలు

**నేలకొండపల్లి:** మండలంలోని మంగాపురం తండాకు చెందిన భూక్యా మణిక అనే మహిళ రైతు బుధవారం వరికోత కోసిన వడ్లను తరలిస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ హైడ్రాలిక్ దింపుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ నుంచి పడిపోయింది. దీంతో కాలుకి తీవ్ర గాయాలుకాగా స్థానికులు ఖమ్మంకు తరలించారు.

### సైబర్ నేరాలపై అవగాహన

**ఖమ్మంఅర్బన్:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ విద్యార్థులకు సూచించారు. బుధవారం నగరంలోని బొమ్మకాలేజీలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేరం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సదస్సులో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కిరణ్, జ్యోతి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుంది'

**కామేపల్లి:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి గింజనూ ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కామేపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి ధాన్యం తేమ శాతం, తూకాలను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ప్రభుత్వం క్వింటా ధాన్యానికి మద్దతు ధరతో పాటుగా అదనంగా రూ.500 బోనస్ అందిస్తుందని చెప్పారు. దీంతో రైతులు దళారులకు ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయిస్తున్నారని తెలిపారు. కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ గాదె నాగయ్య,అజ్మీరా రాందాస్‌నాయక్,రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

### సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొంగులేటిని సత్కరిస్తున్న నాయకులు

**ఖమ్మంరూరల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గ్రానైట్ మార్బుల్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ నాయకులు బుధవారం ఖమ్మంలోని మంత్రి నివాసంలో కలిశారు. మార్కర్స్ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి విన్నవించాక శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు అదాలత్ నరేందర్, సూనావత్ కిషన్, నవీన్, ఎస్‌కె.జానీ, బూర్ల కృష్ణ, రహీం, భద్రం, దిలీప్, నర్సింహారావు, రామ్మూర్తి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రమేష్, ఫయాజ్, అన్వర్, సన్యాసిరావు, ఖాజా, రాజేష్, సీతారాం తదితరులు ఉన్నారు.

### జయప్రదం చేయండి

**ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం):** నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 6న నిర్వహించే రాజ్యాధికారం, మహిళా రిజర్వేషన్‌పై వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా మహిళా అధ్యక్ష, కార్యదర్శులు భూక్య ఉపేంద్రాబాయి, జ్యోతి కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమ పోస్టర్లను బుధవారం ఖమ్మం బీకేబజార్ సంఘ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఝాన్సీ, రమా, ప్రమిల, లలిత తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక భరోసా

● కానిస్టేబుల్ కుటుంబానికి..



ఆర్థిక సాయం అందిస్తున్న తోటి కానిస్టేబుళ్లు

**ఖమ్మంక్రైం:** ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన 2003 బ్యాచ్‌కు చెందిన ఖమ్మం ట్రాఫిక్ కానిస్టేబుల్ జాలాది పార్థసారథి కుటుంబసభ్యులకు ఉమ్మడి జిల్లాకు చెందిన తోటి బ్యాచ్ పోలీస్ సిబ్బంది తమ వంతు సాయంగా రూ.2.50 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. బుధవారం వైరా మండలం రెబ్బవరం గ్రామంలో మృతుడి కుటుంబసభ్యులను కలిసి నగదు అందించారు. ఈ కార్యక్రమంలో తొంటా శ్రీను, కిరణ్ ఈపీ కృష్ణ, మామిడాల శీను, కుడితేటి రామయ్య, సతీష్, మల్లేష్, కృష్ణ, కిరణ్, హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● స్నేహితుడి కుటుంబానికి రూ. 40 వేలు..



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

**నేలకొండపల్లి:** మండల కేంద్రానికి చెందిన 2007 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన కె.నరేష్ ఇటీవల మృతి చెందాడు. దీంతో అతడి స్నేహితులు, పూర్వ విద్యార్థులు తమ వంతు సాయంగా రూ.40 వేల వరకు నగదును బుధవారం మృతుడు పిల్లల పేర్లు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

### కమిషనర్‌కు వినతి

**ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలోని బైపాస్ రోడ్డుపై ప్రభుత్వ నిబంధనలు, మున్సిపాలిటీ చట్టాలను బేఖాతర్ చేస్తూ చేపట్టిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ డిమాండ్ చేశారు. బైపాస్‌రోడ్డులో కొత్త బస్టాండ్ వద్ద కడుతున్న అక్రమ భవనాన్ని నిలిపివేయాలని, నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన బుధవారం కేఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు బండారు యాకయ్య, జె.వెంకన్న బాబు, భద్రం, చిన్న హుస్సేన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు సదుపాయాలు

**ఖమ్మం సహకారనగర్:** ప్రభుత్వం దివ్యాంగుల సౌకర్యార్థం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంఓ) యలగందుల రాజశేఖర్ అన్నారు. నగరంలోని గుట్టలబజార్‌లో గల భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు కల్పిస్తున్న ఆర్థిక సాయం, పరికరాలు, బోధనోపకరణాలపై వివరించారు. అనంతరం దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజ లక్ష్మి, రాజేంద్రనగర్ హైస్కూల్ హెచ్‌ఎం గాయత్రి, పీఎస్ గుట్టలబజార్ హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు లావణ్య, సరిత, రామ్‌సింగ్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

### హామీల అమలుకు పోరాటం

**కామేపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తామని ఆ పార్టీ జిల్లా నాయకుడు దుగ్గికృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం మద్దులపల్లిలో కాటినేని కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసే వరకూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. ఈ నెల 11న సింగరాయపాలెంలో జరిగే సీపీఎం పార్టీ డివిజన్ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు అంబటి శ్రీనివాసరెడ్డి, ఇంజం నాగభూషణం, బాదావత్ శ్రీనివాస్, కిన్నెర రామచంద్రయ్య, రాయల సత్యనారాయణ, వినుకొండ నాగేశ్వరరావు, కిన్నెర రామచంద్రయ్య, రాంబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### న్యాస్ పరీక్ష విజయవంతం

**నేలకొండపల్లి:** పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ సాధన సర్వే పరీక్షలు విజయవంతమయ్యాయి. మండలంలోని కోనాయిగూడెం ప్రభుత్వ పాఠశాలతో పాటు మరో ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించగా.. మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు పర్యవేక్షించారు.

### సమ్మె నోటీస్ అందజేత

**కూసుమంచి:** విద్యాశాఖలో సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న మండలానికి చెందిన ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం ఎంఈఓ రాయల వీరస్వామికి తమ సమ్మె నోటీసును అందజేశారు. గతంలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కాకపోవడంతో సమ్మెకు దిగినట్లు ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మైసయ్య, రాజ్‌కుమార్, ఉపేందర్, మధు, తులసి, కల్యాణి, సుజాత, మణెమ్మ ఉన్నారు.

### ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**ఖమ్మం సహకారనగర్:** సీపీఎస్ రద్దుతో పాటు ఉపాధ్యాయ, లెక్చరర్ల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా తాను పని చేస్తానని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి, రిటైర్డు ప్రొఫెసర్ డా.కొలిపాక వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం నగరంలో సీపీఎస్ జిల్లా నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం–వరంగల్–నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ, లెక్చరర్లు తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, వరంగల్ జిల్లా సీపీఎస్ అధ్యక్షుడు జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారంలో విఫలం

**ఖమ్మంమయూరిసెంటర్:** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ అన్నారు. బుధవారం తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యాన ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 15 రోజుల సమ్మెతో పాటు ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఆరోగ్య శాఖ కమిషనర్ ఆఫీస్ ముందు జరిగిన ఆశాల ధర్నా, చర్చల సందర్భంగా తమ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి నేటికి పరిష్కరించలేదన్నారు. హామీలు అమలు చేయలేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రమ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు జై మంగమ్మ, జిల్లా నాయకులు నాగమణి, రాణి, రాధా, కళ్యాణి, జ్యోతి, కమల, విజయ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు